గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాలు, స్టాళ్ల ప్రదర్శన
- స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు సన్మానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



సిద్ధమైన వేదిక

కర్నూలు: గణతంత్ర దిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయజెండా ఆవిష్కరణ, గౌరవ వందనం స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మైదానం మొత్తం రంగురంగుల జెండాలతో అలంకరించారు. వేదికకు ఇరువైపులా ప్రజాప్రతినిధులు, వీఐపీలు కూర్చునేందుకు వేదికలు ఏర్పాటు చేశారు. నగర ప్రముఖులు, విద్యార్థులు పెద్ద ఎత్తు న కార్యక్రమానికి హాజరవుతున్నందున వేదికకు అన్ని వైపులా షామియానాలు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మా నించేందుకు ఆహ్వానాలు పంపారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రగతిని చాటేలా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఈ సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరమంతా విస్తృత తనిఖీలు

భద్రతా పరంగా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రముఖ కూడళ్లు, జన రద్దీ ప్రాంతాలు, వ్యాపార సము దా యాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఏఆర్ఎస్ఐ నబిరసూల్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పాపారాయుడు, డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి నగరంలోని ప్రధాన రహదారు లతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్, కలెక్టరేట్, ఆర్ఎస్ రోడ్, సిటీ స్క్వేర్ మాల్, జ్యోతి మాల్‌తో పాటు జన రద్దీ ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

మైదానంలో పరేడ్ రిహార్సల్

జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో గురువారం గణతంత్ర వేడుకల పరేడ్ రిహార్సల్స్‌ను పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ కృష్ణకాంత్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ, పరేడ్ రిహార్సల్స్ అతిథుల గ్యాలరీలు, స్టాల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వాహనాల పార్కింగ్, ప్రొటోకాల్ అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.



వైద్య, ఆరోగ్యశాఖ స్టాల్



కలెక్టరేట్ వద్ద తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్

అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ట్రాఫిక్ సిబ్బంది, స్కౌట్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

- వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ సుధీర్‌ప్రేమ్ కుమార్



ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్ కోరారు. వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన విజయవాడలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, ప్రభుత్వ సలహాదారు అజయ్‌కల్లంలను మర్యాద పూర్వకంగా కలిశారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని వర్సిటీలో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సహకరించి అండగా నిలవాలని కోరారు.

హాస్టళ్ల తనిఖీ

నూతన వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ గురువారం వర్సిటీలోని మెన్, ఉమెన్ హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లలోని వసతులు, సౌకర్యాలను విద్యార్థులు, హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాస్టల్స్‌ను నిర్వహించాలని సంబంధిత అధికారలను ఆదేశించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- బస్తిపాడులో పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ



సమావేశానికి హాజరైన ప్రజలు



బస్తిపాడులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణంలో సహకారం అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం బస్తిపాడు జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమ పండుగ వాతావరణంలో జరిగింది. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో రెండో విడతలో 173 మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని 30లక్షల మంది పేదలకు ఇళ్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా మహమ్మారి కారణంగా దేశంలో ఏ రాష్ట్రంలో కూడా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని, కానీ మన రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా పేదలు ఇబ్బందులు పడకుడదనే సంక్షేమ పథకాలు అందించామన్నారు.

మంచి చేసిన ప్రభుత్వానికి అండంగా నిలవాలి

మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలిచి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను, అవాస్తవాలను నమ్మి మోసపోవద్దన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనలో తేడాను గమనించాలన్నారు. పేదలకు అందిస్తున్న నవరత్నాల పథకాల లబ్ధిని పై గతంలో టీడీపీ నాయకులు రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని, నేడు అంతకు మించి సంక్షేమ పథకాలు అందిస్తామని మోసపూరిత హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఏపీబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చిన్న కొట్టాల చింతారెడ్డి, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం





మాట్లాడుతున్న ఆర్‌డీఓ, చిత్రంలో డీఎస్పీ, అడిషనల్ కమిషనర్,ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు (టౌన్): ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ విజయ్‌శేఖర్, నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, తహసీల్దార్ విజయశ్రీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. అధికారులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

నగరపాలక కౌన్సిల్ హాల్‌లో..

ప్రజాస్వామ్యంలో ఓటును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులచే అడిషనల్ కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శేషసాయి, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆధికారి జునీద్, టీపీఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఇందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అరుణ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఒకేషనల్ కాలేజీ విద్యార్థులు

కర్నూలు సిటీ: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మైపర్ కాలేజీలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించి, కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏక్యాంపు నుంచి కలెక్టేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

– సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగల ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ ఓటరు దినోత్సవంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదురెడ్డి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

– ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ పాషా, కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.23లక్షలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి హుండీ లెక్కించినట్లు ఈఓ రామక్రిష్ణ గురువారం తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 12 నుంచి ఇప్పటి వరకు స్వామి వారికి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. అందులో రూ.23,76,741 నగదు, 6.600 గ్రాములు బంగారం, 2.237 కేజీల వెండి సమకూరిందన్నారు. కార్యక్రమానికి నంద్యాల జిల్లా దేవదాయశాఖ అధికారి శశికుమార్, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, వీరయ్య, బీరం శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి స్పర్శ, చెడు స్పర్శలపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): మంచి స్పర్శ, చెడు స్పర్శలకు వీకర్‌సెక్షన్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థినులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ బాలస్వాస్థ్య అధికారిణి హేమలత మాట్లాడుతూ అమ్మాయిలపై అఘాయిత్యాలను అరికట్టాలంటే పాఠశాల స్థాయి నుంచే మంచి స్పర్శ, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పురుషులు తాకే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వేరే ఉద్దేశంతో తాకుతున్నారని అనుమానమొస్తే ఎలాంటి భయం లేకుండా తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాల్లో నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఆరు నెలలకోసారి మింగించే ఆల్బెండజోల్ మాత్రలపై, రక్తహీనత నివారణ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు శ్రీరాములు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.సాయిగోపాల్ అన్నారు. గురువారం ఉస్మానియా కళాశాల సమావేశ మందిరంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సత్యనారాయణ రాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అల్లూరి జీవిత చరిత్రలను యువత చదవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎస్.డి.వి. అజీజ్ రచించిన తెలుగు నవల అల్లూరి సత్యనారాయణ రాజును పారనంది నిర్మల హిందీలోకి అనువాదం చేసిన పుస్తకాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో అల్లూరి సత్యనారాయణ రాజు వ్యాపారవేత్త అల్లూరి జితేందర్‌నాథ్, సాహితీవేత్త చంద్రశేఖర కల్కూర, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీఉద్దీన్ ముజమ్మిల్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా సదస్సును జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈనెల 29న వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు కోరారు. గురువారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. శ్రీరాములు, బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

30న హాకీ క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలురు, జూనియర్ బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 2008 సంవత్సరం పుట్టిన వారై ఉండాలని, జూనియర్ క్రీడాకారులు 2005 సంవత్సరంలో పుట్టిన వారు పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన క్రీడకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువ పత్రం, రూ.10 ప్రవేశ రుసుంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966565317 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉద్ధృతం చేస్తామని ఎస్‌యూసీఐ(సీ) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రాఘవేంద్ర అన్నారు. గురువారం ఎస్‌యూసీఐ(సీ) నగర కార్యదర్శి ఎం.తేజోవతి అధ్యక్షతన రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెట్రోలు, డీజిల్‌తో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతుండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నూతన జాతీ య విద్యావిధానం, నూతన విద్యుత్ సవరణ బిల్లులను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వి.హరీష్‌కుమార్‌రెడ్డి, నా యకులు ఎం.నాగన్న,ఖాదర్, విశ్వనాథ్‌రెడ్డి, బా బు, అశోక్, రోజా, ప్రియాంక, మల్లేష్, శక్రప్ప, బీచుపల్లి పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సి.బెళగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సి.బెళగల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. గురువారం ఆయన అధ్యాపకులు చింతలయ్య, ఉపాధ్యాయుడు వరప్రసాద్‌తో కలిసి గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల వివరాలను వెల్లడించాడు. స్థానిక గురుకుల పాఠశాలలో చేరేందుకు బాలురకు అవకాశం ఉందని, ఐదవ తరగతి (ఇంగ్లిష్ మీడియం), కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు http://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో 25/01/2024 నుంచి ఫిబ్రవరి 23వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 10 ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన ఆడుదాం..ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన సరదాగా బ్యాటింగ్ చేసి, క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం సెమీ ఫైనల్‌లో పాణ్యం జట్టుపై గడివేముల జట్టు విజయం సాధించిందినట్లు పీడీ హరి ప్రసాద్ తెలిపారు. రెండో మ్యాచ్‌లో కల్లూరు మండలం, తడకనపల్లె జట్టు పై కర్నూలు ఎఫ్‌సీఐ జట్టు విజయం సాధించింది. చివరగా గడివేముల, కర్నూలు ఎఫ్‌సీఐ కాలనీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల తదితరులు పాల్గొన్నారు.

నేడు రిపబ్లిక్ డే ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గణతంత్ర దీప్తి పేరుతో గురువారం సాయంత్రం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశభక్తి గీతాలు, జాతీయ సమైక్యత సంగీత విభావరి, అలనాటి తెలుగు చలన చిత్రాలలోని దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

శంషాద్‌కు డాక్టరేట్ ప్రదానం



కర్నూలు(హాస్పిటల్): జూపాడుబంగ్లా మండలం కనకాయ కొట్టాల జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీస్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కర్నూలుకు చెందిన షేక్ గౌశల్ శంషాద్‌కు శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వ విద్యాలయం విద్యా విభాగం ఆచార్యులు నున్నా అనురాధ మార్గదర్శకత్వంలో 'ఏ స్టడీ ఆఫ్ నైన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఇంగ్లీష్ అచీవ్‌మెంట్ ఇన్ రిలేషన్ టు సైకో సోషల్ వేరియబుల్స్' అంశంపై చేసిన పరిశోధనకు గానూ వర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు షేక్‌గౌశల్ శంషాద్ తెలిపారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయండి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 16వ వార్డు స్వామిరెడ్డి నగర్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి గురువారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రామలింగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. మూడు నెలలుగా పైపులైన్ మరమ్మతులకు గురవడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వీలైనంత త్వరగా బాగు చేయించి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకురాళ్లు రేణుక, కామేశ్వరి, ఈశ్వరమ్మ, పావని ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దోమల నివారణకు మునిసిపల్ కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని సీపీఎం ఓల్డ్‌సిటీ, న్యూసిటీ నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం హంద్రీ నది వెంట సీపీఎం బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

నేడు ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాల ఉపసంహరణ సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరు తూ శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి ఎండీ అంజిబాబు కోరారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతోనే ట్రాక్టర్ల ర్యాలీకి సిద్ధమయ్యామన్నారు. కర్నూలు కొత్తబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లు, బైక్‌లు, ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో పార్టీలకు అతీతంగా రైతులు, రైతు కూలీలు, రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు బి.రాధాకృష్ణ, షంషీర్‌మాలిక్, వెంకట్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటండి



జట్టుతో రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నం భీమిలిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ అండర్–14 పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. జట్టులో భరత్, సూరి, మహేష్, రామ్‌చరణ్, అభిషేక్, రాజు, సీమన్, ప్రభుదాస్, నిఖిల్, మనోజ్, రామ్‌కుమార్, వెంకటచరణ్‌లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మహబూబ్, సుభాని, రాఘవేంద్ర పాల్గొన్నారు.

శివతత్వంపై ప్రవచనం



ప్రవచనాన్ని వినిపిస్తున్న పి.శ్రీనివాసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఒంగోలుకు చెందిన పి.శ్రీనివాసులు వారిచే శివత్త్వంపై నిర్వహించిన ప్రవచన కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. ప్రతిరోజూ నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలను దేవస్థానం ఏర్పాటు చేస్తుంది.